క్లుప్తంగా

ఓపెన్ స్కూల్ సేవలను సద్వినియోగం చేసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రభూషణ్

ఓర్వకల్లు: ఓపెన్ స్కూల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని 'ఆప్సాస్' (ఏపీ ఓఎస్ఎస్) జిల్లా కోఆర్డినేటర్ చంద్రభూషణ్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం వివిధ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల హెచ్ఎంలు, ప్రిన్సిపాళ్లు, అంగన్‌వాడీ వర్కర్లకు ఓపెన్ స్కూల్‌పై ఎంఈఓ ఓంకార్‌యాదవ్ అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఓపెన్ స్కూల్ ద్వారా 10వ తరగతి, ఇంటర్ చదువుకునే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ సర్టిఫికెట్లు సాధారణ సర్టిఫికెట్లతో సమానంగా పరిగణిస్తారని తెలిపారు. ఈ సర్టిఫికేట్లు ఉన్నత చదువులకు ఉపయోగపడుతాయన్నారు. 14 ఏళ్ల వయసు పైబడిన బాలబాలికలు ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

వైభవంగా ఉట్టి ఉత్సవం



పోలకల్‌లో ఉట్టి కొడుతున్న యువకులు

సి.బెళగల్: మండలంలోని పోలకల్ గ్రామంలో యావద సంఘం యువత ఉట్టి ఉత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. కృష్ణాష్టమి ముగింపు వేడుకలలో భాగంగా ఆలయం ప్రాంగణంలో ఉట్టికొట్టే ఉత్సవం చేపట్టారు. 12 మీటర్ల ఎత్తులో ఏర్పాటు చేసిన ఉట్టిని కొట్టేందుకు యువకులు పోటీపడ్డారు.

3 నుంచి ఏఐవైఎఫ్ వర్క్‌షాప్

కర్నూలు(సెంట్రల్): సెప్టెంబర్ 3, 4, 5 తేదీల్లో విజయవాడలో జరిగే అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్రస్థాయి వర్క్‌షాపును జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.శ్రీనివాసులు, కారుమంచి కోరారు. మంగళవారం సీఆర్ భవన్‌లో ఆ సంఘం నగర కార్యదర్శి బీసన్న అధ్యక్షతన కర్నూలు నగర ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశం, రాష్ట్రంలో నిరుద్యోగం విలయ తాండవం చేస్తుంటే ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి నోరు మెదపడం లేదన్నారు. ఎన్నికల సమయంలో ఉద్యోగాలు ఇస్తామని మోసం చేశారన్నారు. వర్క్‌షాపులో నిరుద్యోగ సమస్యపై చర్చించి పోరాటాలకు శ్రీకారం చుడతామని చెప్పారు. నాయకులు బాబయ్య, చంటి, కాశీం, సయ్యద్, శివ పాల్గొన్నారు.

30న సత్యసాయి కళాక్షేత్రం ప్రారంభం

కర్నూలు కల్చరల్: సత్యసాయి కళాక్షేత్రం ప్రారంభోత్సవం ఈనెల 30న ఘనంగా నిర్వహించనున్నట్లు సంస్థల అధ్యక్షుడు డి.సాయికృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం నెహ్రూనగర్‌లోని సాయి మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కళాక్షేత్రం ప్రారంభోత్సవ ఆహ్వాన పత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 29న ఉదయం 8 గంటల నుంచి గణపతి పూజతో కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. కన్వీనర్ మాకా అశోక్ కుమార్ మాట్లాడుతూ 30వ తేదీ ఉదయం 8.27 గంటలకు కళాక్షేత్రం ప్రారంభం జరుగుతుతుందన్నారు. 10 గంటలకు శ్రీదేవి భూదేవి సహిత వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం ఉటుందని చెప్పారు. సేవా సంస్థల మాజీ అధ్యక్షుడు సాయిబాబా, సీనియర్ సేవాదల్ రామ్మోహన్, జిల్లా మహిళా సేవాదల్ ఇన్‌ఛార్జి లక్ష్మీ సరోజ, మహిళా కన్వీనర్ సంధ్య, యూత్ కన్వీనర్ సందీప్, సప్తపతి కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కర్నూలు (అగ్రికల్చర్): కర్నూలు నగరంలో విద్యుత్ లైన్లు, మెయింటెనెన్స్ పనులు చేపడుతున్నందున్న బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏడీఈ రాజేంద్రబాబు తెలిపారు. డి2 సబ్ డివిజన్ పరిధిలోని క్యాంపస్ సెక్షన్‌లో ఉన్న బి.క్యాంప్ ప్రాంతం, సోమప్ప కాలనీ, మహాలక్ష్మీ నగర్, అరోరా నగర్, టెలికాం నగర్, లెక్చరర్స్ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు.

కేఎంసీలో వైద్య విద్యార్థుల చేరిక

కర్నూలు(హాస్పిటల్): ఆలిండియా కోటాలో భాగంగా ఐదుగురు విద్యార్థులు మంగళవారం కర్నూలు మెడికల్ కాలేజీలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిచరణ్ సమక్షంలో చేరారు. విద్యార్థులు షేక్ అబ్దుల్ ఫయాజ్ అలీ, మహమ్మద్ జుహేర్, బి.ప్రభాస్ చౌదరి, నరసింహమూర్తి గారి సాయి నిశాంత్, దాసరి మధుహ ఉన్నారు.

వైద్యులకు రక్షణ కల్పించాలి



కొల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటన బాధాకరం. ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా ప్రభుత్వాలు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలి. హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి. వైద్యులకు రక్షణ కల్పించాలి. ప్రతి ఆసుపత్రిలో సిబ్బందికి సౌకర్యాలు కల్పించాలి. రాత్రి వేళలలో సిబ్బందికి ఇబ్బంది లేకుండా పోలీసులను నియమించాలి.

– సుబ్బారెడ్డి, ఎంపీహెచ్ఈఓ, మద్దూర్ పీహెచ్‌సీ



ప్రత్యేక చట్టాలు అమలు చేయాలి



వైద్య విద్యను అభ్యశించే వైద్యులకు ప్రత్యేక భద్రతా చట్టాలు అమలు చేయాలి. ఇటీవల కోల్‌కతాలో జరిగిన ఘటన మాయని మచ్చగా మారింది. మహిళ వైద్య ఉద్యోగులపై ప్రభుత్వాలకు ఏ మాత్రం గౌరవం ఉన్నా హత్యాచారానికి పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలి. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకోవాలి

– డా.నాగరాజు, వైద్యాధికారి, పీహెచ్‌సీ, నన్నూరు

విద్యార్థులకు పరీక్షే!

- పూర్తిస్థాయిలో అందని పాఠ్య పుస్తకాలు
- నేటి నుంచి ఎస్ఏ1 పరీక్షలు
- దిక్కుతోచని స్థితిలో విద్యార్థులు, టీచర్లు



పరీక్షలు రాస్తున్న తరగతి విద్యార్థులు (ఫైల్)

సి.బెళగల్: పాఠశాలలు ప్రారంభమై మూడు నెలలు కావస్తున్న విద్యార్థులు పూర్తిస్థాయిలో పాఠ్య పుస్తకాలు అందలేదు. విద్యా వ్యవస్థపై, పేదింటి పిల్లల చదువులపై టీడీపీ కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యానికి పాఠ్య పుస్తకాల కొరత ప్రత్యక్ష సాక్ష్యం. తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో పాఠ్యపుస్తకాల కొరత తీవ్రంగా వేధిస్తుంది. అరకొర పుస్తకాలు పరఫరా చేసి ప్రభుత్వం చేతులు దులుపుకుందనే విమర్శలు విద్యార్థి సంఘాల నాయకులే కాదు కొందరు ఉపాధ్యాయుల నుంచి వెల్లువెత్తుతున్నాయి. పాఠ్యపుస్తకాల కొరతను పట్టించుకునే నాథుడు కరువయ్యారు. దీంతో విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులు సైతం ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. పాఠ్యపుస్తకాలు ఇవ్వనందున హోమ్ వర్క్ కూడా ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. బుధవారం నుంచి సెల్ఫ్ అసిస్‌మెంట్ – 1 (ఎస్ఏ – 1) పరీక్షలు పరీక్షలు జరుగనున్నాయి. దీంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. పుస్తకాలే ఇవ్వకుండా ఇలా పరీక్షలు రాయాలనే సందిగ్ధంలో పడ్డారు. సి.బెళగల్ మండలంలో ప్రాథమిక పాఠశాలలు 31, ప్రథమికోన్నత పాఠశాలలు 3, జిల్లా పరిషత్ పాఠశాలలు 9, మోడల్, కస్తూర్బా, గురుకులం ఒక్కొక్కటి చొప్పున మొత్తం మండలంలో 46 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 9,606 మంది బాలబాలికలకు చదువు కుంటున్నారు. వీరికి 82 వేలకు పైగా పాఠ్యపుస్తకాలు అవసరం అవుతాయని మండల విద్యాధికారులు అంచనా. అయితే ఐదు విడలలో మండలానికి 78,112 పాఠ్య పుస్తకాలు అందాయి. ఇంకా నాలుగు వేలకుపైగానే పాఠ్యపుస్తకాలు రావాల్సి ఉంది.

పుస్తకాలు లేకుండా చదువులు సాగేదెలా..?

జూన్ 13వ తేదీన పాఠశాలలు పునఃప్రారంభం కాగా నేటి వరకు విద్యార్థులకు పూర్తిస్థాయిలో పుస్తకాలు అందకపోవటంతో చదువులు ఎలా చెప్పాలని టీచర్లు, చదువకునేదెలా అని విద్యార్థులు ఆందోళనలు చెందుతున్నారు. లాంగ్వేజ్‌తో పాటు, గ్రూప్స్ పుస్తకాలు అందకపోవడంతో సమస్య మరింత తీవ్రంగా మారింది. అయితే పుస్తకాలు లేనప్పటికీ వార్షిక పాఠ్య ప్రణాళికల ప్రకారం పరీక్షలను నిర్వహించి విద్యార్థులు సాధించిన మార్కుల గ్రేడులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా విద్యాధికారులు ఆదేశాలు ఇచ్చారు. దీంతో టీచర్లు తప్పని పరిస్థితిలో పరీక్షలు నిర్వహించి మార్కులను నమోదు చేయాల్సి వస్తుంది. అయితే ఇప్పటి వరకు పుస్తకాలు లేకుండా ఎస్ఏ–1ను నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధం కావడంపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులలో ఆందోళనలు మొదలయ్యాయి. పుస్తకాలు లేకుండా చదువులు సాగేదెలా అంటూ విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు.

సమస్య మా దృష్టికి రాలేదు



మండలంలోని అన్ని పాఠశాలలకు అవసరమైన పాఠ్యపుస్తకాలను అందజేశాం. పుస్తకాల కొరత ఉంటే హెచ్ఎంలు మాదృష్టికి తీసుకురావాల్సి ఉంది. పుస్తకాల కొరత సమస్యను ఎవ్వరూ తెలుపలేదు. మరికొన్ని రెండవ సెమిస్టర్ పుస్తకాలు వచ్చాయి. వాటిని త్వరలోనే పాఠశాలలకు అందజేస్తాం. – జ్యోతి, సి.బెళగల్ ఎంఈఓ

సమస్యను ఎంఆర్‌సీకి తెలియజేశాం

మా పాఠశాలకు పూర్తిస్థాయిలో అవసరమైన పాఠ్య పుస్తకాలు రాలేదు. విషయాన్ని ఎంఆర్‌సీకి తెలియజేశాం. త్వరలో వస్తాయి అంటున్నారు. ఉపాధ్యాయులు కూడా హోమ్‌వర్క్ ఇవ్వలేకపోతున్నారు. విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. తప్పని పరిస్థితుల్లో పరీక్షలు నిర్వహించాల్సి వస్తుంది.

– అజీమ్, హెచ్ఎం, సి.బెళగల్ జెడ్పీ హై స్కూల్

ఇప్పటికీ పుస్తకాలు ఇవ్వలేదు



నేను సి.బెళగల్ జెడ్పీస్కూల్‌లో 7వ తరగతి ఇంగ్లిష్ మీడియం చదువుతున్నా. మాకు అన్ని పుస్తకాలు ఇవ్వలేదు. కొన్ని మాత్రమే ఇచ్చారు. గ్రూపు పుస్తకాలు రాలేదు. నాకు తెలుగు, లెక్కలు పుస్తకాలు ఇప్పటి వరకు ఇవ్వలేదు. పరీక్షలు దగ్గరకు వస్తున్నా బక్స్ లేవు. సార్‌వాళ్లను అడిగితే సరఫరా లేదంటున్నారు. ఎలా చదువుకోవాలో అర్థంకావడం లేదు.

– చరణ్, 7వ తరగతి విద్యార్థి, జెడ్పీ హై స్కూల్, సి.బెళగల్

పుస్తకాలను వెంటనే అందజేయాలి



ఉచిత పాఠ్య పుస్తకాలను విద్యార్థులందరికీ తప్పనిసరిగా ప్రభుత్వం అందించాలి. పాఠ్య పుస్తకాలు లేక విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పుస్తకాల సమస్యలను విద్యార్థులు నిత్యం ఉపాధ్యాయులకు, అధికారులు తెలియజేస్తున్నా స్పందన లేదు. పుస్తకాలు ఇవ్వకుండా పరీక్షలు నిర్వహించడం బాధాకరం. అధికారులు పుస్తకాలు అందజేయకపోతే ఆందోళనలు చేపడతాం.

– నబీరసూల్, వైఎస్సార్ఎస్‌యూ, మండల అధ్యక్షుడు

కారును ఢీకొన్న ఆటో



బొల్తాపడిన ట్రాలీ ఆటో

పాణ్యం: మండల కేంద్రమైన పాణ్యంలోని భారత్ పెట్రోల్‌బంక్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైనట్లు హైవే పోలీసులు మంగళవారం తెలిపారు. నంద్యాల పట్టణం రోజకుంట వీధికి చెందిన షేక్ ఖాసీమ్ వలి ట్రాలీ ఆటోలో వంటపాత్రలు విక్రయించి తిరిగి నంద్యాలకు వెళ్తున్నాడు. భారత్‌పెట్రోల్ బంక్ వద్ద షేక్ ఖాసీమ్‌వలికి తేనెటీగ కుట్టడంతో ఆటోను అటుఇటు తిప్పగా ముందు ఆగివున్న కారును ఢీకొని బొల్తాపడినట్లు వారు తెలిపారు. ఈ ఘటనలో ఆటోట్రాలీ డ్రైవర్ షేక్ ఖాసీమ్ వలికి గాయాలైనట్లు తెలిపారు. హైవేపై పాత్రలు చెల్లాచెదురుగా పడ్డాయి. హైవే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకోని ట్రాఫిక్ సమస్య లేకుండా చేశారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు



ట్రాక్టర్‌ను ఢీకొన్న కారు

పాణ్యం: మండల కేంద్రం పాణ్యంలోని డొంగు వద్ద మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలైనట్లు హైవే పోలీసులు తెలిపారు. పాణ్యం నుంచి నరసారావుపేటకు చెందిన నలుగురు వ్యక్తులు కారులో వెళ్తుండగా డొంగు వద్ద ట్రాక్టర్ యూటర్న్ చేసుకుంటుండగా ఈ ప్రమాదం జరిగింది. కారులో ఉన్న నలుగురికి గాయాలయ్యాయన్నారు. హైవే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్ సమస్య లేకుండా చేశారు.

అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు



స్టాక్ రికార్డులు పరిశీలిస్తున్న ఏఓ రవిప్రకాష్

కోడుమూరు రూరల్: మందులు, ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే దుకాణాలను సీజ్ చేస్తామని ఏఓ రవి ప్రకాష్ హెచ్చరించారు. మండల కేంద్రం కోడుమూరులోని ఎరువులు, పురుగుమందుల దుకాణాలను మంగళవారం ఏఓ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ రికార్డులను పరిశీలించారు. కొనుగోళ్లకు సంబంధించి రసీదులు తప్పకుండా ఇవ్వాలని యాజమాన్యాలకు సూచించారు.

పంటకోత ప్రయోగాలను పకడ్బందీగా నిర్వహించాలి

2024 ఖరీఫ్ పంటలకు సంబంధించి పంటకోత ప్రయోగాలను పకడ్బందీగా నిర్వహించాలని ఏఓ రవిప్రకాష్ సిబ్బందికి సూచించారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో 88పంట కోత ప్రయోగాలు చేయాలని సూచించారు.

ప్రత్యామ్నాయ ఉపాధి చూపాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్

ఓర్వకల్లు: టీడీపీ కూటమి ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు హామీని అమలు చేస్తే, ఆటో కార్మికులకు ప్రభుత్వమే ప్రత్యామ్నాయంగా ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆటో యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో మంగళవారం ఆటో కార్మికులతో సమావేశం నిర్వహించారు. సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి షాజాహాన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆటో కార్మికులతో రూ.లక్షల్లో టాక్స్ రూపంలో ఆదాయం వస్తున్న తమ సంక్షేమం పట్టడంలేదని విమర్శించారు. షాజాహాన్ మాట్లాడుతూ ఆటో కార్మికులు ఐక్యమత్యంగా ఉంటే పోరాటాలతో హక్కులను సాధించుకోవచ్చని తెలిపారు. అనంతరం బుక్కాపురంలో కొత్త ఆటో యూనియన్‌ను ఎంపిక చేశారు. కార్యక్రమంలో పాణ్యం డివిజన్ ఆటో నాయకులు వెంకటరాముడు, రామకృష్ణ, గంగన్న, గిరిబాబు, నగేష్, పుల్లయ్య, హరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మినీ జాబ్‌మేళాలో 46 మందికి ఉద్యోగాలు

కర్నూలు(సెంట్రల్): జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మినీ జాబ్ మేళాలో 46 మందికి ఉద్యోగావకాశాలు కల్పించినట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి పి.దీప్తి తెలిపారు. మొత్తం 65 మంది నిరుద్యోగులు జాబ్ మేళాకు హాజరు కాగా, అందులో 46 మందికి యాక్సిస్ బ్యాంకు, ఐబీటీ స్కిల్స్ అకాడెమీ, ఫోన్‌పే, ఫుషన్ ఫైనాన్స్ లిమిటెడ్, నవభారత్ ఫర్టిలైజర్ సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు.

నేడు మండల అధికారుల సమావేశం

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌లో బుధవారం మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల ప్రత్యేకాధికారిణి, జిల్లా మత్స్యశాఖ డీడీ శ్యామల మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమయ్యే సమావేశంలో వికసిత్ ఆంధ్రలో భాగంగా విజన్ 2027 అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణపై వర్క్‌షాప్ ఉంటుందన్నారు. అధికారులు తప్పనిసరిగా సమావేశానికి హాజరు కావాలని డీడీ సూచించారు.

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

సి.బెళగల్: మండలంలో బుధవారం నుంచి నిర్వహించునన్న సెల్ఫ్ అసిస్‌మెంట్ – 1 (ఎస్ఏ – 1) పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఎంఈఓ జ్యోతి సూచించారు. సెప్టెంబర్ 4వ తేదీ వరకు 1వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు పరీక్షలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రశ్నా పత్రాలు ఇప్పటికే ఎంఆర్‌సీకి వచ్చాయన్నారు. హెచ్ఎంలు ఎంఆర్‌సీకి వచ్చి ఏ రోజు ప్రశ్నా పత్రాలను ఆదేరోజు పాఠశాలలకు తీసుకెళ్లాలని ఎంఈఓ సూచించారు.

నేడు భూబాధితుల సదస్సు

కర్నూలు(సెంట్రల్): విజయవాడలో బుధవారం జరిగే భూ బాధితుల సదస్సును విజయవంతం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి దబోళం శ్రీనివాసరావు మంగళవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ సదస్సుకు జిల్లా నుంచి అధికసంఖ్యలో భూ బాధితులు హాజరు కావాలని కోరారు. పేదలు తీసుకున్న ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇవ్వాలన్నారు. భూమి లేని పేదలకు రెండెకరాల భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి



ప్యాలకుర్తిలోని జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ, హౌసింగ్ డీఈఈ

కోడుమూరు రూరల్ : డిసెంబర్ నాటికి పెండింగ్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ సిబ్బందికి సూచించారు. మండలంలోని ప్యాలకుర్తి లోని జగనన్న కాలనీని మంగళవారం ఎంపీడీఓ చంద్రశేఖర్ డీఈఈ వాసుదేవ రావుతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు గృహ నిర్మాణాలను పరిశీలించారు. ఇంజినీరింగ్, హౌసింగ్ సిబ్బందితో చర్చించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ వివిధ దశల్లో నిలిచిపోయిన గృహాలకు సంబంధించిన లబ్ధిదారులతో మాట్లాడి వందరోజుల్లోగా పూర్తి చేసుకునేలా చూడాలన్నారు. లబ్ధిదారులకు ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొస్తే ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కోడుమూరు రూరల్: అగ్ని ప్రమాదాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, గ్యాస్ వినియోగంపై అవగాహన కలిగి ఉండాలని అగ్నిమాపక కేంద్రం ఎస్ఐ మహబూబ్ దౌలత్ సూచించారు. మండల కేంద్రం కోడుమూరులోని పెట్రోల్ బంకుల వద్ద వాహనచోదకులకు అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సి జాగ్రత్తలపై ఎస్ఐ అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ చిన్నచిన్న జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా పెద్ద పెద్ద అగ్ని ప్రమాదాలను నివారించవచ్చునని చెప్పారు.

ట్రాఫిక్ సమస్య తీరేదెన్నడో...?

- జిందాల్ భారీ వాహనాలతో ట్రాఫిక్‌కు అంతరాయం
- మైలేజీ కోసం భారీ వాహనాలు గడివేముల వైపు
- రోడ్డుకు ఇరువైపులా ఆక్రమించి దుకాణాలు
- ప్రతి రోజూ గంటలకొద్ది అంతరాయం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



గడివేముల పాతబస్టాండులో ట్రాఫిక్‌జామ్ అయిన దృశ్యం (ఫైల్)

గడివేముల: మండల కేంద్రం గడివేములలో ఘర్‌కు చేరాలంటే కష్టంగా మారింది. భారీ వాహనాల రాకపోకలతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఒకటి కాదు రెండు కాదు పెద్దఎత్తున వాహనాలు నలిచిపోతుండటంతో ట్రాఫిక్ స్తంభించిపోతుతంది. ప్రజలు ఇళ్లకు వెళ్లేందుకు గంటల తరబడి వేచి ఉండాల్సిందే. అత్యవసర పరిస్థితిల్లో అయితే ఆ కష్టం భగవంతుడుకే ఎరుక అంటూ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకటే ప్రధాన రహదారి ఉండడం, దుకాణం దారులు రోడ్డుపైకి వచ్చి అక్రమించుకోవడంతో రోడ్డు మరింత ఇరుకుగా మారింది. ఈ చిన్నపాటి రహదారిలో జిందాల్ భారీ వాహనాలు అడ్డుఅదుపూ లేకుండా పోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుంది. ఇష్టం వచ్చినట్లు భారీ వాహనాలు గ్రామంలోకి వచ్చి రోడ్డు ప్రక్కనే నిలిపివేయడంతో ట్రాఫిక్‌తో ఇబ్బందులు పడుతున్న ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోకి భారీ వాహనాలు రాకుండా గతంలో ప్రజలు, వాహనదారులు అడ్డుకున్నారు. కొద్ది రోజుల మాత్రం లారీలు గ్రామంలోకి రాలేదు. మళ్లీ యథావిధిగా వస్తున్నాయని వాహనదారులు ఆరోపిస్తున్నారు. పాతబస్టాండు ప్రాంతంలో భారీ వాహనాల కిందపడి మరణించిన సంఘటనలు లేకపోలేదు. స్థానిక సినిమా హాల్ నుంచి జెడ్పీ హైస్కూలు వరకు రోడ్డు వెంట అక్రమ కట్టడాలు చేశారు. దీంతో రోడ్డు ఇరుకుగా మారింది.

భారీ వాహనాలకు సమయమేదీ...?

భారీ వాహనాలకు ఓ సమయం అంటూ లేకపోవడంతో ప్రజలు, వాహనదారులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని రోజుల క్రిందట రాత్రి 9 గంటల నుంచి ఉదయం 6 గంటలకు భారీ వాహనాలకు అనుమతి ఉండేది. దీంతో ఎవరు పట్టించుకోకపోవడంతో జిందాల్ ఫ్యాక్టరీకి సంబంధించిన భారీ వాహనాలు వస్తున్నాయని ఆరోపణలు ఉన్నాయి. పాఠశాలలు, కళాశాలలు, బ్యాంకులు ప్రధాన రోడ్లపై ఉండటంతో నిత్యం వాహనదారులు, విద్యార్థులు ప్రయాణిస్తుంటారు. భారీ వాహనాలు వస్తుండటంతో గంటల కొద్ది ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుంది. జిందాల్ సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం ఫ్యాక్టరీ వద్ద నుంచి నంద్యాల వెంకటేశ్వరపురం వరకు సీసీ రోడ్డును నిర్మించుకుంది. జిందాల్ వాహనాలు ఈ రోడ్డుపైనే నడవాల్సి ఉంది. అయితే కొంత మంది ట్రాన్స్‌పోర్టు యాజమాన్యాలు మైలేజీ కోసం గడివేముల మీదుగా భారీ వాహనాలు నడుపుతున్నారు. దీంతో ఒక్కొక్క లారీకి రెండు నుంచి మూడు వేలు ఆదా అవుతుందని డ్రైవర్లు తెలిపారు. దీంతో రోడ్డు దెబ్బతింటున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గడివేములలోని పాత బస్టాండు ప్రాంతంలో మలుపు చిన్నగా ఉండటంతో భారీ వాహనాలు తిప్పుకునేందుకు లారీ డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారు. ఇంతలోనే ట్రాఫిక్ జామ్ అవుతుందని వాహనదారులు చెబుతున్నారు. లారీలతో రొడ్డుపై దుమ్ము అధికంగా రావడంతో రోగాల బారినా పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



బూజునూరు బాట వద్ద పోలీసులు ఏర్పాటు చేసిన బోర్డు

బైపాస్ ఏర్పాటు చేయాలి



గడివేములలో నంద్యాల–నందికొట్కూరు రహదారి ఇరుకుగా ఉండటంతో భారీ వాహనాలు రావడంతో నిత్యం ట్రాఫిక్‌జామ్ అవుతుంది.భారీ వాహనాలు గడివేములలోకి రాకుండా ఊరి బయట బైపాస్ ఏర్పాటు చేస్తే ఎటువంటి ఇబ్బందులు ఉండవు. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలి. –గోదా ప్రసాద్,గడిగరేవుల

రోడ్లు దెబ్బతింటున్నాయి



మండల కేంద్రమైన గడివేములలో నిత్యం భారీ వాహనాలు వస్తుండటంతో బూజునూరు గ్రామం నుంచి గడివేములకు వెళ్లే రహదారి దెబ్బతిన్నది. అదేవిధంగా ట్రాఫిక్ జామ్ అవుతుంది. భారీ వాహనాలు గడివేములలోకి రాకుండా బైపాస్ ఏర్పాటు చేస్తే బాగుంటాది. అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకుని ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపాలి.

–చిన్నషాలు, బూజునూరు గ్రామం

భారీ వాహనాలు రాకుండా చూడాలి



జిందాల్ ఫ్యాక్టరీ భారీ వాహనాలు గడివేములలోని రాకుండా అరికట్టాలి. ఒకవేళ అనుమతించినా భారీ వాహనాలకు ఓ సమయం కేటాయిస్తే బాగుంటుంది. జిందాల్ యాజమాన్యం కేటాయించిన రహదారిలోనే వాహనాలు వెళ్లితే ట్రాఫిక్‌జామ్ కాకుండా ఉంటుంది. భారీ లారీలతో దుమ్ము రావడంతో రోగాలబారిన పడుతున్నాం.

–రాముడు, గడివేముల